# 'అరూరి' గెలుపుతోనే నియోజకవర్గ ప్రగతి

- జడ్పీటీసీ మార్గం భిక్షపతి
- కార్యకర్తలతో కలిసి విస్తృత ప్రచారం

వర్ధన్నపేట, అక్టోబర్ 26 : అరూరి రమేశ్ ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత వర్ధన్నపేట నియోజకవర్గం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందని వర్ధన్నపేట జడ్పీటీసీ మార్గం భిక్షపతి తెలిపారు. మండలంలోని ఇల్లంద గ్రామంలో నేడు భట్టుపల్లిలో జరుగనున్న ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరడంతోపాటు వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ మార్గం భిక్షపతి పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే రమేశ్ నియోజకవర్గంలోని అన్ని మండలాలను ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే రమేశ్ అన్ని సంక్షేమ పథకాలను అర్హులైన వారికి పారదర్శకంగా అందించేందుకు విశేషంగా కృషి చేశారని చెప్పారు. అంతేకాక మూడో సారి కూడా కేసీఆర్ సీఎంగా బాధ్యతలు తీసుకోవడం ఖాయమన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేసీఆర్ రాష్ట్రంలో పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, రైతు సంక్షేమం, ఇతర కార్యక్రమాలన్నీ అమలు కావాలంటే ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని ఆయన కోరారు. అనంతరం ఇల్లంద రామలింగేశ్వర స్వామి దేవాలయంలో అరూరి గెలుపు కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు.



ఇల్లందలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న జడ్పీటీసీ భిక్షపతి

**ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు**

ఎమ్మెల్యేగా అరూరి రమేశ్ మరోసారి భారీ మెజార్టీతో గెలవాలని కోరుతూ మండల కేంద్రంలోని బాలాంజనేయస్వామి దేవాలయంలో బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజాఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు పట్టణంలోని రామాలయం వాడలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, ఇల్లంద సర్పంచ్ సుంకరి సాంబయ్య, ఎంపీటీసీ శ్రీనివాస్, ఎల్లస్వామి, వర్ధన్నపేట బీఆర్ఎస్ నాయకులు పులి శ్రీనివాస్, ఎండీ అన్వర్, వెంకటేశ్వర్లు, వీరస్వామి, దేవేంద్ర, రాజు పాల్గొన్నారు.

## ప్రజా ఆశీర్వాద సభతో కాంగ్రెస్, బీజేపీలు గల్లంతు

**వర్ధన్నపేట నియోజకవర్గ డివిజన్ల ఫోరం కన్వీనర్ రాజు**

కాశీబుగ్గ, అక్టోబర్ 26 : గ్రేటర్ వరంగల్‌లోని భట్టుపల్లి శివారులో శుక్రవారం నిర్వహించే ప్రజా ఆశీర్వాద బహిరంగ సభతో కాంగ్రెస్, బీజేపీ అడ్రస్ లేకుండా గల్లంతు అవుతాయని వర్ధన్నపేట నియోజకవర్గ డివిజన్ల ఫోరం కన్వీనర్, వరంగల్ పీఏసీఎస్ డైరెక్టర్ నేరెళ్ల రాజు తెలిపారు. గురువారం 3వ డివిజన్‌లోని కొత్తపేట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బొచ్చు రాజు ఆధ్వర్యంలో ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేరెళ్ల రాజుతోపాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జన్ను అనిల్‌కుమార్ మాట్లాడుతూ సమిష్టి కృషితో అరూరి రమేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొని కేసీఆర్‌ను 3వ సారి సీఎం చేస్తామన్నారు. అన్ని వర్గాల కోసం అభివృద్ధితోపాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. విలీన గ్రామాల అభివృద్ధిని చూసి అరూరిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఇసంపల్లి రవీందర్, ఎండి ఖాజా, మండల సంపత్, బుర్ర సతీష్, పురం కార్తీక్‌లు పాల్గొన్నారు.



కొత్తపేటలో ప్రచారం చేస్తున్న నేరెళ్ల రాజు, జన్ను అనిల్‌కుమార్

**పైడిపల్లిలో..**

నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లిలో భట్టుపల్లిలో జరిగే ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని జన్ను సారంగపాణి(జేఎస్‌పీ) ఆధ్వర్యంలో 125వ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్ కన్వీనర్, సీనియర్ నాయకుడు జన్ను సారంగపాణి మాట్లాడుతూ అరూరిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ పీఏసీఎస్ డైరెక్టర్ జన్ను ఉల్లాసకరుణాకర్, జన్ను రమేశ్, కృష్ణ, కన్నయ్య, సంపత్, యుగేందర్, ప్రతాపు, అనిల్, యాకూబ్ పాల్గొన్నారు.

## 'నేటి కేసీఆర్ సభను విజయవంతం చేయాలి'

హసన్‌పర్తి, అక్టోబర్ 26 : నేడు వర్ధన్నపేట నియోజకవర్గంలోని భట్టుపల్లిలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు సీఎం కేసీఆర్ హాజరవుతున్న నేపథ్యంలో కార్యకర్తలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గ్రేటర్ ఒకటో డివిజన్ పరిధిలోని ముచ్చర్లలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముచ్చర్ల నుంచి సుమారు 800ల మంది తరలివెళ్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు సూర ప్రమోద్‌కుమార్, పాల్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## 4వ బెటాలియన్‌లో ఓపెన్‌హౌస్

కరీమాబాద్, అక్టోబర్ 26 : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మామునూరులోని 4వ బెటాలియన్‌లో కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు రకాల ఆయుధాలను చూపించి వాటి పనితీరును వివరించారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

రాయపర్తి, అక్టోబర్ 26 : ప్రయాణంలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితురాలికి గురువారం అప్పగించినట్లు ఎస్సై దేశిని విజయ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పద్మ గత నెల 13న వరంగల్ నుంచి రాయపర్తికి ఆర్టీసీ బస్సులో వెళ్లింది. ఈ క్రమంలో తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకుంది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో పద్మ ఫోన్‌ను గజ్వేల్‌లో గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితురాలికి అందజేసినట్లు ఆయన వివరించారు. గురుకుల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్, సిబ్బంది తూళ్ల సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

## ఓటు నమోదుకు 31వరకు గడువు

నడికూడ, అక్టోబర్ 26 : ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవడానికి ఈనెల 31వరకు గడువు ఉందని తహసీల్దార్ నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అర్హత కలిగిన వారు తమ పేరు ఓటర్ల లిస్టులో ఉందో లేదో తెలుసుకోవాలని సూచించారు. ఒకవేళ ఓటరుగా నమోదు కాకుంటే ఫాం–6 ద్వారా వెంటనే నమోదు చేసుకోవాలన్నారు.

## మసీద్ కాంపౌండ్ నిర్మాణానికి ఆర్థిక సాయం

హసన్‌పర్తి, అక్టోబర్ 26 : డివిజన్‌లోని ప్రతి వార్డును అభివృద్ధి చేయడమే లక్ష్యమని 55 డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజితావెంకటేశ్వర్లు అన్నారు. భీమారంలోని మసీద్ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి కార్పొరేటర్ రజితావెంకటేశ్వర్లు రూ.2లక్షల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు వెడల్పులో మసీద్ కాంపౌండ్ వాల్‌ను కూల్చి వేయగా ముస్లిం కులపెద్దలు వినతి మేరకు తన వంతుగా ఈ ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. అనంతరం కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఎర్రగట్టు గుట్ట ఆలయ చైర్మన్ చింతల లక్ష్మణ్, డివిజన్ ఉపాధ్యక్షుడు సంగాల చిన్న, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## అల్పాహార నాణ్యతా ప్రమాణాల పరిశీలన

రాయపర్తి, అక్టోబర్ 26 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలను గురువారం డీసీఈబీ కార్యదర్శి గారె కృష్ణమూర్తి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందజేస్తున్న అల్పాహార నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అల్పాహారం, మధ్యాహ్న భోజనాల తయారీలో ఏజెన్సీలు నాణ్యతా ప్రమాణాలతోపాటు శుభ్రతను పాటించాలని కోరారు. హెచ్‌ఎం పాక పద్మావతి, ఉపాధ్యాయులు గుగులోత్ సునీత, మారం రోజారాణి, ప్రభాకర్, మమత పాల్గొన్నారు.

## రాంనగర్‌లో సీఎం అల్పాహార పథకం ప్రారంభం

ఐనవోలు, అక్టోబర్ 26: మండలంలోని రాంనగర్ పాఠశాలలో సీఎం అల్పాహార కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం తగిన పౌష్టికాహారం అందించడంలో భాగంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. మొదటి విడుతలో ఎంపికైన రాంనగర్ పాఠశాలలో సీఎం అల్పాహారం కార్యక్రమాన్ని హెచ్‌ఎం బానోత్ రవికుమార్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రహ్మచారి, అంగన్‌వాడీ టీచర్ శారద, మధ్యాహ్న భోజన కార్మికులు రజిని, లక్ష్మి పాల్గొన్నారు.



రాంనగర్ పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

## 'ఎన్నికల ప్రశాంత నిర్వహణకు సహకరించాలి'

సంగెం, అక్టోబర్ 26 : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పోలీస్‌శాఖ, ఎన్నికల అధికారులకు సహకరించాలని పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్ కోరారు. గురువారం మండల కేంద్రంతోపాటు మండలంలోని కుంటపల్లి, గవిచర్ల, కాట్రపల్లి గ్రామాల్లోని ప్రధాన రహదారులలో మామునూర్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సంగెం, పర్వతగిరి, ఐనవోలు పోలీస్ సిబ్బందితోపాటు కేంద్ర బలగాలతో శాంతియుత ర్యాలీలు, కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాలకు లోబడి తమ కార్యక్రమాలను నిర్వహించుకోవాల్సిందిగా సూచించారు. ప్రజలు, మతాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించే వ్యక్తులు, పార్టీలపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో తక్షణమే బెల్ట్ షాపులను ఎత్తి వేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై భరత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

- సీపీ అంబర్‌కిశోర్‌ఝా
- ఆత్మకూరు పోలీస్ స్టేషన్, పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ

ఆత్మకూరు, అక్టోబర్ 26 : ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సీపీ అంబర్‌కిశోర్‌ఝా పోలీస్ అధికారులకు సూచించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌ను, పోలింగ్ కేంద్రాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీపీ ముందుగా పోలీసుల పనితీరును పరిశీలించారు. ఇటీవల నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంతోపాటు కటాక్షపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. గూడెప్పాడ్, కటాక్షపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను తనిఖీ చేశారు. ఆత్మకూరు పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం అక్కడే ఉన్న విద్యార్థులతో సీపీ కొద్ది సేపు ముచ్చటించారు. పరకాల ఏసీపీ కిశోర్‌కుమార్, సీఐ రవిరాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు ప్రసాద్, రాజేశ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గూడెప్పాడ్ చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న సీపీ అంబర్‌కిశోర్‌ఝా

## క్రికెట్ విజేతలకు బహుమతుల అందజేత

పర్వతగిరి, అక్టోబర్ 26 : మండలంలోని చింతనెక్కొండలో యువ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు గురువారం అవార్డులను, బహుమతులను అందించారు. టోర్నమెంట్ ఓవరాల్ ఛాంపియన్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ చెవులపెల్లి రజినీకాంత్ అందుకున్నారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఇల్లందుల సుదర్శన్ విజేతలకు అవార్డులను అందించారు.

## 'పోలింగ్‌కు అన్ని సౌకర్యాలు కల్పించాలి'

శాయంపేట, అక్టోబర్ 26 : అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 30న పోలింగ్ జరుగుతుందని, ఇందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశానికి హరిప్రసాద్ హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలను సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అనంతరం శాయంపేటతోపాటు పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అమంచ కృష్ణమూర్తి తదితరులున్నారు.

## కటాక్షపురం చెక్ పోస్టు వద్ద రూ.లక్ష స్వాధీనం

ఆత్మకూరు, అక్టోబర్ 26 : మండలంలోని కటాక్షపురం చెక్ పోస్టు వద్ద గురువారం రాత్రి చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రవిరాజు తెలిపారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం ... గ్రామానికి చెందిన గాజుల రాజన్న నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్సైలు ప్రసాద్, రాజేశ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్లకు ఇరువైపులా ముళ్ల పొదల తొలగింపు

రాయపర్తి, అక్టోబర్ 26 : మండల కేంద్రం మీదుగా ఉన్న పాలకుర్తి–రాయపర్తి–అన్నారం షరీఫ్ రోడ్డు మార్గానికి ఏపుగా ముళ్లపొదలు, చెట్లు పెరిగి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనదారులు, వాహనాలకు ఎదురుగా వస్తున్న వాహనాలు సరిగ్గా కన్పించకపోవడంతో ఇటీవల పలు ప్రమాదాలు జరిగాయి. మండల ప్రజలు చేసిన విజ్ఞప్తుల మేరకు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సహకారంతో గురువారం రాయపర్తి–పెర్కవేడు, రాయపర్తి–కొండూరు గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు, చెట్లను తొలగించినట్లు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ముద్రబోయిన సుధాకర్ తెలిపారు. మండల ప్రజల విజ్ఞప్తి మేరకు ముళ్లపొదల తొలగింపుజేసిన మంత్రి ఎర్రబెల్లికి కృతజ్ఞతలు తెలిపారు. చందు సతీశ్‌యాదవ్, జొనుగోని రవిగౌడ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

దామెర, అక్టోబర్ 26 : మండలంలోని ఊరుగొండ బస్టాండ్ వద్ద గురువారం రాత్రి ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఊరుగొండ గ్రామానికి చెందిన పోలెపాక స్వామి రోడ్డు దాటుతుండగా హనుమకొండ నుంచి చిట్యాలకు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో స్వామి కాలువిరిగి తలకు గాయమైంది. స్థానికులు చికిత్సకోసం వరంగల్‌కు తరలించారు.